ఎండిపోతున్న కూలీలు..!



- ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కరువు
- అడ్రస్ లేని గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు
- పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలంటున్న వైనం

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కాకనే ఎండలు మండుతుండటంతో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తల్లడిల్లిపోతున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నప్పటికీ ఉపాధి కూలీలకు వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. జిల్లా వ్యాప్తంగా గతంలో వచ్చిన గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. పనుల వద్ద ఉపాధి కూలీలు సేద తీర్చుకోవడానికి గుడారాలను, ప్రథమ చికిత్స కిట్లను గతంలో ఇచ్చేవారు. అయితే వైసీపీ పాలనలో ఇవన్నీ కానరాకుండా పోయాయి. జిల్లా వ్యాప్తంగా 2.75లక్షల జాబ్‌కార్డులున్నాయి. ఇందులో 1.66లక్షల కుటుంబాలు ఉండగా, అందులో 2.87లక్షల మంది కూలీలు ఉన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన గడ్డపారలు కూడా కూలీలకు అందలేదు. అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ తదితర సౌకర్యాలు ఏర్పాటుచేయాలని కూలీలు కోరుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేసినా కూలి గిట్టుబాటు కావడంలేదని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి గిట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలి



గత టీడీపీ ప్రభుత్వంలో పొదుపు సంఘాల ద్వారా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చేవారు. అయితే వైసీపీ పాలన ఉన్న సమయంలో గూడారాలు, ప్రథమ చికిత్సకిట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి, వీళ్లైనా స్పందించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలి.

- ఆంజనేయులు, ఉపాధి కూలీ, గరుడంపల్లి

ఎండలకు అల్లాడుతున్నాం



సంక్రాంతి పండుగ పోయిన తర్వాత ఎండలు బాగా పెరిగాయి. ఎండకు అల్లాడిపోతున్నాం. గుడారాలు, ప్రథమచికిత్స కిట్లు, తాగునీరు, మజ్జిగ పనుల వద్ద ఏర్పాటు చేయాలి. ఎండ వేడిమి నుంచి సేద తీరడానికి చెట్ల కిందకు వెళ్తున్నాం. గుడారాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- గంగాదేవి, ఉపాధి కూలీ, తలమర్ల

వసతులు కల్పిస్తాం

ఉపాధి కూలీలకు పనుల వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం. పనుల వద్ద గుడారాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పనుల వద్ద కుండలను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. ప్రథమ చికిత్స కిట్లను అందిస్తాం. కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉదయం మిగిలిన పనులను సాయంత్రం చేయిస్తాం.

- నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

అహో.. ఆంధ్రభోజ..

అట్టహాసంగా శ్రీకృష్ణదేవరాయల జయంత్యుత్సవాలు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

పెనుకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రభోజుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జయంతిని జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా చేసుకున్నారు. రాయల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ర్యాలీలు చేపట్టారు. విజయనగర సామ్రాజ్య రెండో రాజధానిగా వెలుగొందిన పెనుకొండ పట్టణంలో బలిజసంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బలిజసంఘం నాయకులు, స్థానికులు తోటగేరి ఆంజనేయస్వామి ఆలయం నుంచి బ్యానర్లు పట్టుకుని, నినాదాలు చేస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మార్కెట్ సర్కిల్ వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం సమావేశంలో శ్రీకృష్ణదేవరాయల పాలనను కీర్తించారు. కార్యక్రమంలో బలిజసంఘం నాయకులు ఆదినారాయణ, ప్రగతి శ్రీనివాసులు, పులగూర్ల శ్రీనివాసులు, గుట్టూరు సూర్యనారాయణ, వీహెచ్‌పీ నేత వేదవ్యాస్ పాల్గొన్నారు.



అబ్బురం.. బాలల సంబరం

అట్టహాసంగా ముగిసిన అనంత బాలోత్సవం

ఏడు వేల మంది విద్యార్థులు హాజరు

7

భూమి ఒకరిది.. పేరు మరొకరిది..!



భూయజమానికి బదులు మరొకరికి వన్‌బీలు

లబోదిబోమంటున్న బాధితులు... చిలమత్తూరు మండలంలో ఇష్టారాజ్యం



ROR-1B

పట్టాదారుని పేరు : చలపతి
తండ్రి/ భర్త పేరు : చిన్న నారాయణప్ప
ఖాతా నెంబరు : 682 సర్వే నెం. : 492-1
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 0.23
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ : Jan 3 2025

1

పట్టాదారుని పేరు : చలపతి
తండ్రి/ భర్త పేరు : చిన్న నారాయణప్ప
ఖాతా నెంబరు : 682 సర్వే నెం. : 492-6
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 0.23
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ : Jan 3 2025

2

పట్టాదారుని పేరు : చలపతి
తండ్రి/ భర్త పేరు : చిన్న నారాయణప్ప
ఖాతా నెంబరు : 682 సర్వే నెం. : 492-6
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 0.28
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ : Jan 3 2025

మల్లిరెడ్డికి చెందిన వన్‌బీని చలపతి అనే వ్యక్తి పేరుతో చేసిన మ్యుటేషన్

చిలమత్తూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ శాఖలో జరిగిన 'లీల'లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. భూమి హక్కుదారుల పేర్లను తొలగించి మరొకరి పేరును వన్‌బీలో చేర్చారు. దీన్ని గుర్తించిన అసలైన హక్కుదారులు రెవెన్యూ సిబ్బందిని నిలదీస్తే సాంకేతిక సమస్యలతో ఇలా జరిగిందని, సరిదిద్దుతామని సాకులు చెబుతున్నారు. ఒకవేళ జరిగిన మార్పుని గుర్తించలేని అమాయక రైతుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని చిలమత్తూరు రెవెన్యూ పొలం సర్వేనంబర్ 492-1, 492-6 భూమికి హక్కుదారులుగా తుమ్మలకుంటకు చెందినవారు ఉన్నారు. వారి పేర్లను వన్‌బీ నుంచి తొలగించి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి జనవరి 3న మ్యుటేషన్ చేశారు. దీనిని గుర్తించిన నిజమైన హక్కుదార్లు వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులను నిలదీశారు. తమకు పిత్రార్జితంగా వచ్చిన ఆస్తిని ఇతరులకు వన్‌బీ ఎలా చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసిన తప్పు ఒప్పుకోలేక సాంకేతిక సమస్యతో ఇలా జరిగిందంటూ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. జరిగిన తప్పుని సరిదిద్దుతామని బాధిత భూ యజమానులకు తెలిపారు. అయితే భూ యజమానులు పెనుకొండ ఆర్డీఓ వద్దకు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై విన్నవించుకున్నారు. దాంతో వెంటనే జరిగిన తప్పును సరిచేయాలని ఆయన మండల అధికారులకు ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు మండలంలో అనేకం జరిగాయి. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా యునస్ బాబు ఉన్న సమయంలో ఇష్టానుసారంగా వ్యవహరించి పెద్ద ఎత్తున రికార్డులను తారుమారు చేయడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు రెవెన్యూ అధికారులు అక్రమార్జనకు అలవాటు పడి ఒకరి భూములకు సంబంధించిన వన్‌బీలను మరొకరికి ధారదత్తం చేస్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. భూ రికార్డులను తమకు ఇష్టం వచ్చినట్లుగా తమకు అనుకూలంగా ఉన్నవారి పేరుతో యథేచ్ఛగా బదలాయిస్తున్నారు. దీంతో అసలైన భూ యజమానులు తమ ఆస్తులను కాపాడుకోవడానికి తహసీల్దార్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. గత ఐదు నెలలుగా మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇదే తంతు నడుస్తోంది.

ఒక్కొక్కటిగా బయటకు..

మండలంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న యునస్ బాబుని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించిన ఐదు నెలల కాలంలో ఇలాంటి రెవెన్యూ లీలలు చాలా పెద్ద ఎత్తున జరిగాయని సమాచారం. ఆయన చేసిన అవకతవకలు రోజుకొకటి బయటికి వస్తున్నాయి. ఇటీవలే చాగలేరు రెవెన్యూ పొలంలో ఏకంగా 23 ఎకరాల భూములకు ఎలాంటి సంబంధంలేని వ్యక్తుల పేరుతో ఆయన ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రిలీవ్ అయ్యే ఆఖరి క్షణంలో మ్యుటేషన్ చేశారు. దీంతో బాధితులు జరిగిన అన్యాయంపై జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వన్‌బీలను డిస్ప్యూట్ కింద చేర్చారు. ఇలాంటి అక్రమాలు ఆయన హయాంలో చాలానే జరిగాయి.



తుమ్మలకుంట గ్రామానికి చెందిన మల్లిరెడ్డి పేరుతో ఉన్న వన్‌బీ

ఆందోళనలో భూయజమానులు

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల మార్పుతో భూ యజమానుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. అధికారుల తీరుతో ఏ సమయంలో తమ భూములు ఇతరుల చేతుల్లోకి వెళతాయోనని ఆందోళన చెందుతున్నారు. రికార్డులను ఆన్‌లైన్లో చూసుకోకపోతే భూముల సంగతి మరిచిపోవాల్సిందేనని అంటున్నారు. ఎక్కడా జరగని విధంగా చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయంలోనే ఇలా జరగడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొందరైతే ఇలా తెలియకుండా మ్యుటేషన్ మార్పు చేయించుకొని వాటిని అమ్మకాలకు సైతం పెడుతున్నారని భూ యజమానులు వాపోతున్నారు. ఇలాంటి అధికారుల పట్ల జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలపై ప్రస్తుత ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేశులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కార్యాలయంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు.

అభివృద్ధి తోవ..!

- చివరి ఆయకట్టుకు నీరు అందించే చర్యలు
- ప్రధాన కాలువ లైనింగ్ పనులకు శ్రీకారం
- 193 చెరువుల పనుల్లో కదలిక



లైనింగ్ చేపట్టే హంద్రీనీవా ప్రధాన కాలువ

పుట్టపర్తి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాయలసీమ వరప్రదాయిని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పనుల్లో కదలిక వచ్చింది. చివరి ఆయకట్టుకు నీరివ్వాలన్న లక్ష్యంతో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేపడుతోంది. ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసి, జిల్లా ప్రజలకు సాగు, తాగునీటి కష్టాల్లోకి నెట్టింది. ఐదేళ్లు హడావుడి తప్ప.. ప్రాజెక్టు పనుల్లో పురోగతి శూన్యమన్నది బహిరంగ రహస్యమే. కూటమి అధికారంలోకి వచ్చిన ఐదునెల్లోనే కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో సాగు, తాగు నీటి సమస్యలు తీర్చేలా ప్రణాళికలు రూపొందించింది. చివరి ఆయకట్టుకు నీరు ఇచ్చేలా హంద్రీనీవాకు నిధులు కేటాయించింది. వాటితో జిల్లాలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా కాలువ ఆధునికీకరణలో భాగంగా లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. పనులు పూర్తి చేస్తే చివరి ఆయకట్టుదాకా కృష్ణాజలాలు అంది, జిల్లా సశ్యశ్యామలంగా మారనుంది. సోమవారం పుట్టపర్తి మండలం జానకంపల్లి వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రారంభించనున్నారు.

హంద్రీనీవాకు పూర్వవైభవం

గత టీడీపీ ప్రభుత్వం 2014-19లోనే జీడిపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా పెండిగ్ పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. కాలువ లైనింగ్ కూడా చేపట్టాలనుకుంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు హంద్రీనీవాను నిర్లక్ష్యం చేసింది. రూపాయి కూడా నిధులు కేటాయించకుండా సార్వత్రిక ఎన్నికల ముందు కుప్పంకు నీళ్ల షో పేరుతో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువలో నెలల తరబడి నీటిని తీసుకెళ్లి జిల్లాలో రిజర్వాయర్ల, చెరువులను ఎండబెట్టారు. కూటమి ప్రభుత్వం రాగానే హంద్రీనీవా ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొస్తోంది. కాల్వ సామర్థ్యం పెంపునకు ప్రణాళికలు రూపొందించి, అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా కాలువల లైనింగ్ చేపట్టేందుకు రూ.1,150 కోట్లు కేటాయించింది. ఇందులో జీడిపల్లి నుంచి కదిరి దాకా ప్రధాన కాలువ 184 కి.మీ. లైనింగ్ చేపట్టేందుకు రూ.900 కోట్లు కేటాయించారు. పుంగనూరు, కుప్పం ఉపకాలువకు 75 కిలోమీటర్లు రూ.250 కోట్లు చేపడుతున్నారు.

193 చెరువుల పనుల్లో కదలిక

పుట్టపర్తి నియోజకవర్గ పరిధి ఆరు మండలాల్లో 193 చెరువులకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు నింపే పనుల్లో కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం రాయల సీమ కరవు నివారణ పథకం కింద 2021 జనవరిలో రూ.864.18 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది మేలో అప్పటి సీఎం జగన్‌తో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. పనులు మాత్రం మొదలు పెట్టలేదు. 2400 ఎంసీఎఫ్‌టీల కృష్ణాజలాలను హంద్రీనీవా కాలువ ద్వారా అవసరమైన చోట్ల ఎత్తిపోతల పైపుల ద్వారా పథకం నేరుగా చెరువులను నింపాలన్నది లక్ష్యం. జీడిపల్లి నుంచి కుప్పం వెళ్లే ప్రధాన హంద్రీనీవా కాలువ నుంచి ఆరుచోట్ల నీటిని ఎత్తిపోయాలి. ఇందుకోసం 372 కి.మీ. పైపులైన్ కాలువల ద్వారా నీటిని సరఫరా చేసి చెరువులకు తరలించాలి. హామీలతో ఐదేళ్లు గడిపేశారు. భూనిర్వాసితులకు పైసా పరిహారం చెల్లించకుండా సార్వత్రిక ఎన్నికల ముందు నీరు ఇచ్చేస్తున్నట్లు నమ్మించే ప్రయత్నంలో భాగంగా పైపులు దింపుడు డ్రామాకు తెరలేపారు. కూటమి అధికారంలోకి రావడంతో 193 చెరువులకు నీరిచ్చే పనుల్లో కదలిక వచ్చింది. పుట్టపర్తి మండలం చేర్నోపల్లి వద్ద పైపులను సిద్ధం చేసి, తరలిస్తున్నారు.

కొనసాగిన యజ్ఞం

అలరించిన సంగీత కచేరి



యజ్ఞం చేస్తున్న పండితులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో అతిరుద్ర మహాయజ్ఞం మూడోరోజు ఆదివారం కూడా కొనసాగింది. వేద పండితులు మహాగణపతి పూజతో ప్రారంభించారు. రుద్రాభిషేకం, సర్వదేవతా అర్చన నిర్వహించారు. సాయంత్రం ఎంబర్ కన్నన్ శ్రీసత్యనారాయణ్ బృందం సంగీత కచేరి అలరించింది. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై మధురగానంతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మమహాసమాధిని దర్శించుకున్నారు.

అడవులకు నిప్పుపెడితే..

కఠిన చర్యలు: డీఎఫ్ఓ



డీఎఫ్ఓ చక్రపాణి

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) చక్రపాణి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని అడవులకు ఇటీవల కాలంలో నిప్పు పెట్టడం అధికమైందన్నారు. ఉద్దేశపూర్వకంగా అడవులకు నిప్పు పెట్టేవారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు. చాలా మంది అవగాహన లేక అడవులక నిప్పు పెడుతున్నారన్నారు. జిల్లాలో మూడు అటవీ రేంజ్‌ల పరిధిలో మంటలను ఆర్పడానికి సిబ్బందితోపాటు అదనంగా 14 మంది ఫైర్ వాచర్లను నియమించినట్లు చెప్పారు. డ్రోన్లతో నిరంతరం నిఘా పెడతామన్నారు. అడవుల సమీప గ్రామాల ప్రజలు, గొర్రెల కాపర్లు సమాచారం అందించి, సహకరించాలని డీఎఫ్ఓ కోరారు.

ఎస్‌ఐ పేరుతో బెదిరింపులు..!

బంగారు వ్యాపారులకు ఫోన్లు...

డబ్బు కోసం డిమాండ్..

7

పొరపాటా.. బాధ్యతారాహిత్యమా..?

ఫార్మసిస్టును లోపల పెట్టి తాళం..

పెద్దాస్పత్రిలో మందుల కోసం రోగుల నిరీక్షణ..

రెండు గంటల తర్వాత వెలుగులోకి..

జీబీఎస్‌పై ఆందోళన అవసరం లేదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజాబేగం



పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గులియన్ బాడీ సిండ్రోమ్ (జీబీఎస్) గురించి ఆందోళన అవసరం లేదనీ, ఇది అంటువ్యాధి కాదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజాబేగం ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎక్కువగా ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉంటుందన్నారు. నాడీవ్యవస్థ దెబ్బతిని, కండరాల బలహీనతతో ఏర్పడే వ్యాధి అన్నారు. ఇది అరుదైనది తప్ప.. అంటువ్యాధి కాదన్నారు. వైరస్ ద్వారాగానీ, బ్యాక్టీరియా ద్వారాగానీ వస్తుందన్నారు. నరాల బలహీనత, కాళ్లు, చేతులు చచ్చుబడటం, గొంతు పొడిబారిపోవడం, ఆహారం తీసుకోకపోవడం వ్యాధి లక్షణాలు అన్నారు. వ్యాధి సోకకుండా కాళ్లు, చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. సామూహిక మరుగుదొడ్లను వినియోగించినపుడు ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. అసాధారణ నీరసం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు ఉన్నపుడు, ఫ్లూలక్షణాలు, 3 రోజులకంటే ఎక్కువ రోజులు జ్వరం ఉంటే డాక్టర్లను వెంటనే సంప్రదించాలన్నారు.

వేతనాల కోసం కార్మికుల సమ్మెబాట

నేటి అర్ధరాత్రి నుంచి శ్రీరామిరెడ్డి తాగునీరు బంద్

ఉమ్మడి జిల్లాలో 850 గ్రామాలకు ఇబ్బందులే..!



పీఏబీఆర్ వద్ద కార్మికులతో మాట్లాడుతున్న ఓబులు

కూడేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరునెలల వేతనాలు, 30 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్టు వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టులో దాదాపు 600 మంది కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి పంపులు బంద్ చేసి సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, బెళుగుప్ప, పరిగి, హిందూపురం, మడకశిర డివిజన్‌లలోని 850 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. వేతనాలు చెల్లించకపోతే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని, ఈ విషయంపై పలుమార్లు కాంట్రాక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకే సమ్మెకు సిద్ధమైనట్లు తెలిపారు. అనంతరం కార్మికుల డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయనతోపాటు కార్మిక సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, నాగరాజు, రవి, కాసీం, కొండారెడ్డి, ఈశ్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 375 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి మున్సిపల్ సమస్యలపై ఉద్యమం



మాట్లాడుతున్న రాజేష్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలపై సోమవారం నుంచి ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, భద్రతను ఏజెన్సీలు, ప్రైవేట్ కంపెనీలకు కాకుండా మున్సిపల్ శాఖకే పూర్తిగా కేటాయించాలన్నారు. ప్రైవేట్‌కు అప్పగించాలన్న ఆలోచనను పూర్తిగా విరమించుకోవా లన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా ఇప్పటి వరకూ కార్మికుల సమస్యలు ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. నగరాలు, పట్టణాల్లో పెరిగిన జనాభా మేరకు కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్న తదతర డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తామన్నారు. ఈ నెల 17 నుంచి దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా కోశాధికారి వేణుగోపాల్, జిల్లా సమితి సభ్యులు ప్రసాద్, సాగర్, ధనుంజయ పాల్గొన్నారు.

ఎస్‌ఐ పేరుతో బెదిరింపులు..!

బంగారు వ్యాపారులకు ఫోన్లు... డబ్బు కోసం డిమాండ్..



నకిలీ ఎస్‌ఐ నరేంద్రరెడ్డి

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నేను కళ్యాణదుర్గం ఎస్‌ఐను... మీ దుకాణంలో దొంగ బంగారం ఉందని సమాచారం అందింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు డబ్బులతో వచ్చి సమస్యను పరిష్కరించుకోండి. లేదంటే కేసు నమోదు చేస్తానని బంగారు దుకాణ యజమానులకు ఓ నకిలీ ఎస్‌ఐ బెదిరించాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పట్టణ సీఐ యువరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఓ మోసగాడు దీన్ని ఆసరాగా చేసుకున్నాడు. తాను కళ్యాణదుర్గం టౌన్ ఎస్‌ఐ నరేంద్రరెడ్డి అని 7670994788, 8008635488 నంబర్లతో కడప, గుంటూరుకు చెందిన ఇద్దరు బంగారు వ్యాపారులకు ఫోన్లు చేశాడు. మీరు దొంగ బంగారం కొన్నారు, దొంగలు పట్టుబడి మీ పేర్లు చెప్పారు. స్టేషన్‌కు వస్తే విచారణ చేయాలని బుకాయించాడు. డబ్బులు తీసుకురాకపోతే కేసులు పెట్టి అరెస్టు చేస్తానని బెదిరించాడు. అలాగే అనంతపురానికి చెందిన ఓ టైలర్‌కు ఫోన్‌చేసి మీ ఇంట్లో దొంగతనం జరిగింది కదా ఇందుకు సంబంధించి దొంగలు దొరికారు. బంగారం రికవరీ అవుతుంది, మీరు డబ్బులు ఇవ్వాలని మభ్యపెట్టాడు. ఇద్దరు వ్యాపారులు, సదరు బాధితుడు కళ్యాణదుర్గం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్‌ఐ నరేంద్రరెడ్డి ఎక్కడున్నారని టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అడిగారు. ఇక్కడ ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉందని, అలాంటి వ్యక్తులు ఎవరూలేరని చెప్పడంతో ఖంగుతిన్నారు. ఈ విషయాన్ని పోలీస్ సిబ్బంది సీఐ దృష్టికి తీసుకెళ్లడంతో నకిలీ ఎస్‌ఐ బాగోతం వెలుగు చూసింది. ఇలాంటి వారిని నమ్మవద్దని చెప్పి సీఐ బాధితులను తిరిగి పంపించేశారు. మోసగాడి నంబర్లకు ఫోన్ చేస్తే తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ ప్రాంతంగా చూపుతోందని పోలీసులు గుర్తించారు. ఆదిలాబాద్‌లోనూ ఇదే విధంగా చేశాడని ఉన్నతాధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇప్పటివరకు బాధితులు ఎవరూ నకిలీ ఎస్‌ఐకి డబ్బులు ఇవ్వలేదన్నారు. ప్రజలు నకిలీల బారిన పడి మోసపోవద్దని, ఏదైనా సందేహాలుంటే పోలీస్‌స్టేషన్‌కు నేరుగా వచ్చి తెలుసుకోవాలని సీఐ సూచించారు.

అబ్బురం.. బాలల సంబరం



అలరించిన నృత్యం



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ సన్నివేశం

అట్టహాసంగా ముగిసిన అనంత బాలోత్సవం

మూడు రోజులు... ఏడు వేల మంది విద్యార్థులు



నాట్యం భళా..

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'అనంత బాలోత్సవ' సంబరం ఆదివారం ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు అనంతపురంలోని లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణాలు పిల్లల ఆటపాటలతో సందడిగా మారాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడురోజుల ఆటవిడుపు నూతనోత్తేజం నింపింది. వారి ప్రదర్శనలు చూసి వీక్షకులు ఎంతో ముచ్చటపడ్డారు.

సృజనను వెలికితీసేందుకు దోహదపడతాయి

- వెంకటరమణ నాయక్, ఆర్‌ఐఓ

పిల్లల్లో దాగున్న ప్రతిభతోపాటు సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. బాలోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు రోజులపాటు ఇంతటి చక్కటి వాతావరణంలో బాలోత్సవాన్ని సజావుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్‌కేపీ కార్యదర్శి పద్మజ, బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య, మానవత రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, గోవిందరాజులు, కోటీశ్వరప్ప, లింగమయ్య, సుబ్బరాయుడు, సరళ, దేవేంద్రమ్మ పాల్గొన్నారు.

అవినీతి రాజకీయ నాయకుల

ఆస్తులు జప్తు చేయాలి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి



మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అవినీతి రాజకీయ నాయకుల ఆస్తులను జప్తు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు రాజకీయ నాయకుల అక్రమాలపై కేసులున్నపుడు రాజకీయ జోక్యంతో, అర్థ, అంగ బలాలతో కొంతకాలం కాలయాపన చేస్తూ బయట స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులున్నాయన్నారు. దీనిపై అవే సంస్థ ఆధ్వర్యంలో సామాజికవేత్తలతో సమావేశమై ఈ అంశంపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. దేశంలో, రాష్ట్రంలో అవినీతి పరులైన రాజకీయ నేతలపై సత్వరం చర్యలు తీసుకునేలా కేంద్రం జోక్యం చేసుకోలని ప్రధాని మోదీని కోరతామన్నారు.

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవు

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులకు తావులేదని వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసులోనే చట్టపరంగా వల్లభనేని వంశీని అరెస్టు చేశారన్నారు. వేధింపులు, కక్షసాధింపు, చట్టపరంగా చర్యలకు వ్యత్యాసాన్ని అన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని కోరారు. వంశీని హైదరబాద్ నుంచి నేరుగా గన్నవరం స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. గత ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు, ఇతర నాయకులపై కక్ష సాధింపులో భాగంగా అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు సుదూర ప్రాంతాలకు తిప్పి వేధించారన్నారు.

ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందే వైసీపీ

హంద్రీనీవా లైనింగ్ పనులు అడ్డుకుంటామనడం శోచనీయం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

అనంతపురం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందే వైసీపీ అన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు మరిచిపోయి మాట్లాడటం దారుణమని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి గంపెడు మట్టి తీసిన పాపాన పోలేదన్నారు. అనంతపురంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చివరి ఆయకట్టుకు నీరు చేరాలన్నా, చెరువులు నింపాలన్నా లైనింగ్ అవసరమన్నారు. ఐదేళ్లలో హంద్రీనీవా నుంచి చుక్క నీరు కూడా రాప్తాడుకు తీసుకురాలేని వైసీపీ నాయకులు ప్రాజెక్టుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా లైనింగ్ కోసం టెండర్లు పిలిచినా.. పనులు చేయలేదన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో 2019కి ముందు జగన్‌రెడ్డి ఉరవకొండలో దీక్ష చేయడంతో పాటు.... తాము అధికారంలోకి వస్తే... హంద్రీనీవా పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు మరచిపోయి మాట్లాడటం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టునైనా సందర్శించారా అని వైసీపీ నాయకులను నిలదీశారు. ప్రాజెక్టులను నాశనం చేసింది చాలక, లైనింగ్ పనులను అడ్డుకుంటారా అంటూ ధ్వజమెత్తారు. కుప్పంలో నీళ్లు వదిలినట్లు డ్రామాలాడిన చరిత్ర వైసీపీదేనన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు వ్యవహారంలో ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు. నిందితులను చట్టం పరిధిలోనే ప్రభుత్వం శిక్షిస్తోందన్నారు.

పొరపాటా.. బాధ్యతారాహిత్యమా..?

ఫార్మసిస్టును లోపల పెట్టి తాళం

పెద్దాస్పత్రిలో మందుల కోసం రోగుల నిరీక్షణ

రెండు గంటల తర్వాత గుర్తించిన వైనం..

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): డ్యూటీలో ఉన్న ఫార్మసిస్టును లోపలపెట్టి తాళం వేశారు. దీంతో మందుల కోసం రోగులు, వారి బంధువులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఆదివారం ఓపీ ఉండదు. క్యాజువాలిటీలోనే సాధారణ రోగులకు డాక్టర్లు పరీక్షించి మందులు రాసిస్తారు. 14వ నెంబరు గదిలో పగటి పూట మందులు ఇస్తారు. అయితే ఆదివారం ఆస్పత్రిలో ప్రతిరోజు మందులుఇచ్చే ప్రధాన కౌంటర్‌లోనే ఫార్మసిస్టు ఉంటూ మందులు ఇస్తున్నారు. కానీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆ మందులు ఇచ్చే ప్రధాన కౌంటర్‌కు వెళ్లే దారికి ఉన్న గేటుకు తాళం వేసేశారు. అప్పటికీ ఫార్మాసిస్టు డ్యూటీలోనే లోపల ఉన్నారు. ఈవిషయం తెలియక రోగులు, వారి కుటుంబసభ్యులు మందుల కోసం 14వ నెంబరు గదికి వెళ్లారు. అక్కడ తాళం వేసి ఉంచారు. ప్రధాన కౌంటరుకు వెళ్లే ప్రధాన ఇనుపగేటుకు తాళం వేసి ఉంచారు. దీంతో ఎక్కడా మందులు లభించక దాదాపు రెండున్నర గంటల పాటు పడిగాపులు కాశారు. ఎవరిని అడిగినా సరైన సమాధానం రాలేదు. ఆ సమయంలో అక్కడకి వెళ్లిన విలేకరులకు బాధితులు ఈ విషయం తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టరు హేమలత దృష్టికి తీసుకెళ్లగా వారు వైద్య సిబ్బంది విషయం గురించి ఫోన్‌లో ఆరా తీశారు. అప్పుడు లోపలున్న ఫార్మసిస్టు బయటకురాగా అక్కడ ప్రధానగేటుకు తాళం వేసి ఉన్న వ్యవహారాన్ని గుర్తించారు. ఆ తర్వాత ఓ సెక్యూరిటీ గార్డు వచ్చి తాళం తీశారు. దీంతో మందుల కోసం వేచి ఉన్న వారి నిరీక్షణకు తెరపడింది. ఆస్పత్రిలో సిబ్బంది బాధ్యతారాహిత్యానికి ఈ సంఘటన నిదర్శనమని పలువురు రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఫార్మసిస్టును లోపల పెట్టి తాళం వేసిన దృశ్యం

కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే బడ్జెట్

వామపక్ష నాయకుల ధ్వజం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా ఉందని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్, ప్రత్యామ్నాయ విధానాలపై సదస్సు నిర్వహించారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సురేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారమన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.50 లక్షల కోట్లు అన్నారు. ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్ సంస్థలకు కోసం కేటాయించినట్లు ఉందని ధ్వజమెత్తారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్‌సింగ్‌లు రూ.52 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. 11 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మోదీ చేసిన అప్పు రూ.155 లక్షల కోట్లు అన్నారు. ఇంత అప్పుచేసిన మోదీ దేశంలో పరిశ్రమలు, ప్రాజెక్టులు కట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా బాబులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రధాని రూ.14లక్షల 46వేల కోట్లు మాఫీ చేశాడని విమర్శించారు. మనరాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాడని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలో మన ఎంపీలు ధర్నాలు చేయాలని సూచించారు. విభజన చట్టంలోని హామీలు భాగంగా రాయలసీమలో రైల్వేజోన్, వెనుకబడిన ప్రాంతాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమకు ఖనిజ సంపద కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మహేష్, గోపినాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాము, రామాంజనేయులు, సీపీఎం శ్రీనివాసులు, మారుతిప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి రాజధాని రైలు కింద పడినట్లు ఆ రైలు లోకోపైలెట్ సమాచారం అందించినట్లు తెలిపారు. హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి 35 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతదేహంపై పచ్చరంగు టీషర్ట్, నల్ల ప్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే హిందూపురం రైల్వే పోలీస్ 9441238182, 9440 627641లకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు..



లక్ష్మీనారాయణ (ఫైల్)

గార్లదిన్నె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున లగేజీ ఆటోను ఐషర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ (40) అనే రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు శింగనమల మండలం నిదనవాడకు చెందిన లక్ష్మీనారాయణ తనకున్న కొంత భూమిలో వ్యవసాయం చేసుకునేవాడు. ఇటీవల లగేజీ ఆటోను కొనుక్కుని గ్రామంలో చిన్న చిన్న బాడుగులకు తిప్పేవాడు. అయితే తన గేదెను అమ్మడానికి అనంతపురం సంతకు లగేజీ ఆటోలో డ్రైవర్ అశోక్‌తో కలిసి బయల్దేరాడు. రామదాసుపేట వద్ద ఆటోను వెనుక వైపు నుంచి ఐషర్ వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రైతు లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య దేవి, ముగ్గురు పిల్లలున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో డ్రైవర్ అశోక్, గేదె సురక్షితంగా బయటపడ్డారు.

అమిద్యాలలో భారీ చోరీ

20తులాల బంగారు ఆభరణాలు, రూ.1.5లక్షల నగదు అపహరణ



తెరిచి ఉన్న బీరువా

ఉరవకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమిద్యాల గ్రామంలో దర్జీ నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఇంట్లో 20 తులాల బంగారు, రూ.1.50లక్షల నగదును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. నారాయణరావు అతని భార్య సరస్వతితో కలిసి 20 రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బెంగళూరులో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, నగదును దోచుకెళ్లారు. బాధితుడు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడం, బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్



బుక్కపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి

బుక్కపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా స్థానిక ఆయన విగ్రహం వద్ద ఆదివారం పలువురు బలిజ సంఘం నాయకులు నివాళులర్పించారు.దేశ భాషాలందు తెలుగు లెస్సా అని ప్రపంచానికి చాటి చెప్పి గొప్ప వ్యక్తి కృష్ణదేవరాయలని కొనియాడారు. కార్యక్రమంలో బలిజ కులస్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ధర్మవరం : రాయల జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ కులస్థులు పెనుబోలు భాస్కర్, అరిగెల భాస్కర్, చిన్నూరు లోకేశ్, తొండమాల గుర్రప్ప, మిరియాల అంజి పాల్గొన్నారు.

జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన వారు

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో జూనియర్ బాలుర, సీనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 100 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు కర్నూలులో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా హ్యాండ్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు. క్రీడాకారులకు వైఎస్ ఎల్ ఎంటర్ ప్రైజస్ యజమాని చంద్రశేఖర్ టీషర్టులు, హ్యాండ్ బాల్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు రియాజ్ ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా ధ్వంజస్తంభ ప్రతిష్ఠ

తనకల్లు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్తికోటలో ఆదివారం శ్రీరామాలయం ఎదురుగా ధ్వంజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆ గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛరణ నడుమ గ్రామస్థులు ఆ ధ్వంజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం దీపారాధన కార్యక్రమం, మంగళ , బుధవారాల్లో రామ, లక్ష్మణ, సీతా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకులు ఎస్‌కే మస్తాన్‌వలీ, మంజునాథ్ తెలిపారు.

వినాయక ముఖ కవచం అందజేత

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో వినాయక విగ్రహానికి రూ. 42 వేల విలువైన వెండి ముఖ కవచాన్ని దాతలు తబ్బూల్ రవిప్రకాశ్ కుటుంబసభ్యులు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతవూరిలోని గ్రామదేవత పెద్దమ్మ తల్లికి మాఘమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి కొండన్న తెల్లవారుజామున అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, వెండి కిరీటాలు, వేప మండలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు పెద్దమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వం డిగ్రీకళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో అండర్ 19, అండర్ 16 మధ్య జరిగాయని కోచ్ నజీర్ తెలిపారు. ముందుగా బ్యాటింగ్ చేసిన అండర్ 19 జట్టు నిర్ణీత 20 ఓవర్లలో వంద పరుగులు చేసింది. నరసింహ 50, తరుణ్ 43 పరుగుల చేశారు. బోలర్లు తేజశ్వనీ, సంతోష్ చెరో వికెట్ తీశారు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన అండర్ 16 జట్టు 80 పరుగులు మాత్రమే చేసింది.

నేడు ఉరుసు మహోత్సవం

కొత్తచెరువు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బుక్కపట్నం రహదారి ప్రక్కన ఉన్న హజరత్ మస్తాన్‌వలీ ఉరుసు మహోత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయని వక్ఫ్‌బోర్డు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు చాదర్‌గలాఫ్ ఎక్కించుట, రాత్రి 10 గంటలకు పకీరుల డబ్బులతో పూలచాందనితో గంధం పూజ, మంగళవారం రాత్రి 9గంటలకు దీపారాధన, కవాలి కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం రాత్రి 9గంటలకు జియారత్ కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. 122 ఉరుసు మహోత్సవాలకు కులమతాలకు అతీతంగా ప్రజలు హాజరుకావాలని వారు కోరారు.

ఘనంగా వార్షికోత్సవం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండాను మాను వీధిలో ఉన్న మదరసారబ్బానీయా వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మదరసా కమిటీ కార్యదర్శి అత్తార్ మహబూబ్‌బాషా, సభ్యులు అజీమ్‌ఖాన్, అన్వర్‌బాషా, కౌన్సిలర్ బీబీజాన్ పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారానికి సోమవారం సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహిస్తున్నామని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నూరు గ్రామంలో 8,9 వార్డుల జనసేన ఇన్‌చార్జ్‌లు కొండమ్మ, అడ్డగిరి శ్యాంకుమార్ ఆధ్వర్యంలో 500 వైసీపీ కుటుంబాలు జనసేనలో ఆదివారం చేరాయి. ఇందులో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ పరీక్ష

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్థానిక బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మోడల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇందులో యూటీఎఫ్ జోన్ నాయకుడు రామకృష్ణనాయక్, జేవీవీ జిల్లా నాయకుడు డాక్టర్ ఆదిశేషు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్న, సీపీఎం నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్, హరి పాల్గొన్నారు.

పొలాల్లో అగ్ని ప్రమాదాలు



ఆహుతైన మామిడి మొక్కలు (ఫైల్)

- నిప్పురవ్వ పడ్డా.. పంటలు బుగ్గిపాలే
- ఓడీసీలో కలగానే అగ్నిమాపక కేంద్ర నిర్మాణం
- కదిరి నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సిందే
- ఫైర్ స్టేషన్ నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు
- వైసీపీ హయాంలో ముందుకు సాగని వైనం





ఇటీవల ప్రమాదంలో దగ్ధమైన డ్రిప్ పరికరాలు

వీర ఓబునపల్లి మొరుము కొండలో మంటలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాల్లో అగ్ని ప్రమాదం జరిగితే.. అగ్నిమాపక వాహనం కదిరి నుంచి రావాల్సిందే. కదిరి... ఓడీసీకి 23 కిలోమీటర్లు, అమడగూరుకు 43 కిలోమీటర్ల, నల్లమాడకు 30 కిలోమీటర్లు దూరంలో ఉంది. అంతదూరం నుంచి అగ్నమాపక వాహనం వచ్చేలోపు జరగాల్సిననష్టం జరిగిపోతోంది. ఇక ఈ మండలాల్లోని మారుమూల గ్రామాల్లో అగ్ని ప్రమాదం జరిగితే.. పరిస్థితి మరీ ఘోరం. ఎండకాలం ప్రారంభం అవుతోంది. అయినా ఎండలు ఇప్పుడే మండిపోతున్నారు. పొలాల్లోని, రోడ్ల పక్కన ఉన్న గడ్డి బాగా ఎండింది. ఓ చిన్నపాటి నిప్పురవ్వ పడ్డా.. మంటలు చెలరేగి.. సమీప పొలాలకు వ్యాపించి.. పచ్చని చెట్లు దగ్ధమవుతున్నాయి.

● టీడీపీ హయాంలో ప్రతిపాదనలు

అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాలకు సంబంధంచి.. ఓడీసీలో అగ్ని మాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు నాటి ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అందుకు కావలసిన స్థలాన్ని కూడా రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దాని గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పాలకులకు పలుమార్లు రైతులు, ప్రజలు విన్నవించినా.. ఫలితం లేకుండా పోయింది. ఎండకాలాల్లో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగి.. చాలా మంది తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చొరవ చూపి ఓడీసీలో అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

● మండుతున్న ఎండలు

వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు, ఆకతాయిలు ఎండు గడ్డికి అగ్గి పెట్టడంతో అది కాస్త పొలాల్లోకి వ్యాపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల మండలంలోని వీర ఓబునపల్లిలో రైతు చిన్నబాబు పొలంలో అగ్ని ప్రమాదం జరిగి మామిడిచెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్లు కాలిబూడిదయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన సూర్యనారాయణ, శివన్న, రామచంద్ర సాగుచేసిన మామిడిచెట్లు, డ్రిప్ కాలిపో యి దాదాపు రూ. రెండు లక్షలు నష్టం జరిగింది. కొండకమర్ల పంచాయతీలోని వీరప్పగారిపల్లికి చెందిన డేరంగుల రామచంద్ర పొలంలో కూడా అగ్ని ప్రమాదం జరిగి, రూ.70 వేలు నష్టం జరిగింది. మునుముందుకు మరిన్ని ప్రమాదాలు జరిగి, ఆస్తి నష్టం జరగకముందే పాలకులు, అధికారులు స్పందించాలి.

● అవగాహన కల్పించాలి

ఎండకాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. కొంతమంది ఆకతాయిలు చేసే పనులకు రూ.లక్షలు నష్టం జరుగుతోంది. అలాగే కొంత మంది రైతులు పొలాల్లో వేస్తున్న మంటలు.. పక్క పొలాలకు వ్యాపించి.. పచ్చని చెట్టు దగ్ధమవుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిప్పు పెట్టడం వలన కలిగే నష్టాలు, నిప్పు పెట్టేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీశాఖాధికారులు, ప్రజాసంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● అంతరిస్తున్న అడవులు

ఈ మూడు మండలాల్లో అటవీ ప్రాంతం నానాటికీ తరిగిపోతోంది. ఆకతాయిలు నిప్పు పెట్టడం వల్ల కొండలు, గుట్టల్లోని పచ్చని చెట్లు కాలి బూడిద అవుతున్నాయి.

తీవ్రంగా నష్టపోతున్నాం



మాకు అందుబాటులో అగ్నిమాపక యంత్రం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మామిడిచెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. రూ.80వేలదాకా నష్టపోయాను. మండలకేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే మేలు.

- చిన్నబాబు, వీర ఓబునపల్లి, ఓడీసీ

తగ్గుతున్న అటవీ సంపద



ఎండకాలం మొదలైతే చాలు అగ్నిప్రమాదాల భయం. కొంతమంది ఆకతాయిలు చేసే పనులకు ఆస్తి నష్టం జరుగుతోంది. అలాగే అడవులు కాలిపోవడం వలన వన్య ప్రాణాలు అంతరించి పోవడంతో పాటు అటవీసంపద పూర్తిగా నాశనం అవుతోంది. ప్రజల్లో అటవీ శాఖాధికారులు అవగాహన కల్పిస్తే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చు.

-నాగవేణి, మిట్టపల్లి, ఓడీసీ

పాలకుల దృష్టికి తీసుకెళ్లా



ఓడీచెరువులతో అగ్రిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాలకు కలిపి ఓడీచెరువులో అగ్రిమాపక కేంద్రాన్ని నిర్మిస్తే ఈ మూడు మండలాలకు అనుకూలంగా ఉంటుంది. ఫైర్ ఇంజన్ కదిరి నుంచి వచ్చేలోపు చాలా నష్టం జరిగిపోతోంది.

- వీరాంజనేయులు, బీజేపీ మండలఅధ్యక్షుడు, ఓడీసీ

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



నియామకపత్రాలు అందుకున్న యువత, చిత్రంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లి మంగళకర కళాశాలలో పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నిర్వహించిన జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. నియోజకవర్గం నుండి సుమారు 1600 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. 60పైగా ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో పలు కంపెనీలు 305 మందిని ఎంపిక చేసుకొని.. వారికి నియామక పత్రాలను అందజేశారు. మరో 390 మంది అభ్యర్థులను పరిశీలనలో ఉంచారు. ఈ జాబ్‌మేళాలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, పీవీకేకే కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, మంగళకర కళాశాల ప్రిన్సిపల్ బిందుజ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, జయచంద్రారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

● నేడు లైనింగ్ పనులకు శ్రీకారం

నియోజకవర్గంలోని రెండు రిజర్వాయర్లతో పాటు 193 చెరువులను హంద్రీనీవా నీటితో నింపడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. జాబ్‌మేళా అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు తో పాటు లైనింగ్ పనులను రూ 400 కోట్లతో చేపట్టనున్నామని, ఈ పనులను బుక్కపట్నం మండలం జానకంపల్లి వద్ద సోమవారం ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పాలపొంగు



అలంకారంలో కాటకోటేశ్వరస్వామి



కొంగుమంటలు ఏర్పాటు చేసిన భక్తులు

తాడిమర్రి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిగాంచిన కాటకోటేశ్వర క్షేత్రంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆదివారం పాల పొంగు కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. గత ఏడాది పొంగుల సందర్భంగా కాటమ క్షేత్రంలో ఘర్షణ చోటుచేసుకోవడంతో ఈ ఏడాది పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రామగిరి సీఐ శ్రీధర్, ముదిగుబ్బ సీఐ శ్యామరావు, ఎస్ఐలు క్రిష్ణవేణి తదితరులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్లతో బందోబస్తు పర్యవేక్షించారు. ముందుగా చిల్లా వంశస్థులు ఆలయం ఎదుట పొంగుల కార్యక్రమం నిర్వహించి స్వామివారికి ప్రసాదం అందజేశారు. ఆ తరువాత చిల్లకొండయ్యపల్లికి చెందిన భక్తులు ఆలయంలోకి వెళ్లి టెంకాయ కొట్టేందుకు పోలీసులు అనుమతించారు. ఈ సందర్భంగా చిల్లా వంశస్థులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వీరందరు ఆలయ ప్రాంగణం నుంచి వెళ్లిన తరువాత సాయంత్రం చిల్లవారిపల్లికి చెందిన భక్తులు స్వామివారి ప్రసాదం నివేదించి.. టెంకాయ కొట్టేందుకు అనుమతించారు. గొడవలు జరగకుండా దాదాపు 100 మంది పోలీసుల బలగాల మధ్య పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. ఆదివారం రాత్రి కూడా పోలీసు బలగాలు అక్కడే ఉన్నాయి.

● ధర్మవరంరూరల్: మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో పాలపొంగుల వెల్లువను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారజామునే మాఘస్నానాలు ఆచరించి కొత్తకుండలో నైవేద్యం చేసి పాలుపోసి పొంగులను నిర్వహించారు. అనంతరం నైవేద్యం తయారుచేసే కుండను ప్రత్యేకంగా పూజించి శ్రీమన్నారాయణకు మొక్కులు తీర్చుకున్నారు.



మిట్టపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



నల్లబోయినపల్లిలో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

పూర్వ విద్యార్థుల సమావేశం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాటి గురువులు నీలకంఠేశ్వర, చంద్రశేఖర్, విఠల్ ప్రసాద్, హనీఫ్, రహంతుల్లా, సుగుణమ్మ, రజియాసుల్తాన్‌ను సన్మానించారు.

●బత్తలపల్లి : మండలంలోని నల్లబోయనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో 2005-2006 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. అలనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు వెల్పుల జగదీష్‌రెడి, లావన్య, ఉషా, లక్ష్మీపతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

చికిత్స పొందుతూ మేస్త్రీ మృతి



భగవంతప్ప (ఫైల్)

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతు కుంట గ్రామానికి చెందిన రైల్వేగ్యాంగ్ మన్ మేస్త్రీ వందిపర్తి భగవంతప్ప (43) అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. గత కొంతకాలంగా కడుపునొప్పి, అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఇతను శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెల్సిందే. స్థానికులు అతన్ని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారజామున మృతిచెందాడు. అతనికి భార్య సావిత్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి...



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ధర్మవరం,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటు వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటాయని, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94407 96831, 94406 63788 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఇరువర్గాల ఘర్షణ.. 20 మందిపై కేసు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపల్లిలో రస్తా విషయమై ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. అనేక రోజులుగా ఈ రస్తా సమస్య ఉంది. ఆదివారం రస్తాకు తిరుమలయ్య కంప అడ్డు వేయడంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఒక వర్గానికి చెందిన తిరుమలయ్య, రఘురామయ్య, లేపాక్షికి, మరో వర్గానికి చెందిన ప్రతాప్, సంతోష్, మల్లికార్జున గాయపడ్డారు. ఒక వర్గం వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి, మరో వర్గం వారిని అనంతపురం ఆసుపత్రికి పోలీసులు తరలించారు. సీఐ శివరాముడు రాఘవపల్లి గ్రామానికి వెళ్లి.. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి ..

ధర్మవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన వసంతకుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన ఆరుగురు దాడిచేయడంపై వారి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వసంతకుమార్ కొత్తపేట టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. ధనుంజయ, శశి, ప్రభాస్, మను, సన్ని, రామాంజి పాతగొడవలను దృష్టిలో ఉంచుకుని అతనిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో గాయపడ్డ వసంతకుమార్‌ను స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వసంతకుమార్ ఫిర్యాదు మేరకు ఆ ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయండి



కోర్టు ఆదేశాలను చూపుతున్న తంగెం వంశీయులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం చెన్నరాయనిస్వామి ఆలయ అర్చకత్వం విషయంలో కోర్టు ఆదేశాలను అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తంగెం వంశీయులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం వారు స్థానిక హనుమాన్ దేవాలయంలో మాట్లాడుతూ.. చెన్నరాయనిస్వామి ఆలయంలో అర్చకత్వాన్ని తంగెం - చిల్లా కుటుంబ సభ్యులు రొటేషన్ పద్ధతిలో నిర్వహించాలని కోర్టు, దేవదాయశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ పద్ధతి ప్రకారం తాము అర్చకత్వం చేయాల్సి ఉందన్నారు. అయితే తమను ఆలయ ఆవరణంలోకి రానీయకుండా చిల్లా వంశీయులు మాదప్ప, చెంద్రాయిడు, ముద్దప్ప అడ్డుకొంటున్నారని వాపోయారు. దీనిపై బుక్కపట్నం పోలీసులను సంప్రదించినా తమకు న్యాయం జరగలేదని, దీనిపై తాము ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని అర్చకుడు అంజనేయులు తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా ఆదినారాయణ స్వామి రథోత్సవం

చిలమత్తూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):మండల సరిహద్దుకు సమీపంలో కర్ణాటక చిక్కబళాపురం జిల్లా, గుడిబండ తాలూకా ఎల్లోడు గ్రామంలోని కూర్మగిరిపై వేంచేసి ఉన్న ఆదినారాయణస్వామి రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ముందుగా స్వామివారికి విశేష పుష్పాలంకరణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కొండ కింద ప్రాంగణంలో ఉన్న స్వామి వారి ఆలయం వద్ద రథ సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆశీనులను చేసి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామి వారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

హద్దుమీరి వైద్యం అందిస్తే కఠిన చర్యలు



వైద్యులతో సమావేశమైన డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు వచ్చీ రాని వైద్యంతో హద్దు మీరి చికిత్స అందిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం 'రెచ్చిపోతున్న ఆర్ఎంపీలు' అన్న శీర్షికన వెలువడిన కథనంపై ఆమె స్పందించారు. హిందూపురంలోని ఎంసీహెచ్ కేంద్రంలోని పిపి యూనిట్‌లో ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డితో పాటు పీపీ యూనిట్ల వైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో ఆర్ఎంపీల వైద్యంపై చర్యల కోసం జిల్లావ్యాప్తంగా 14 మంది వైద్యులతో ఏడు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. హిందూపురంలో ఆరుగురు వైద్యులతో మూడు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని కానీ, క్లినిక్ అని కానీ రాసి ఉండరాదన్నారు. కేవలం ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ఉండాలని సూచించారు.

కరాటే విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



గ్రేడింగ్ పరీక్షలో గెలుపొందిన వారు

గోరంట్ల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో గోన్‌షిరో కరాటే ఆకాడమి వారు విద్యార్థులకు ఆదివారం బెల్టు గ్రేడింగ్ పరీక్షలు జరిపినట్లు నిర్వాహకులు త్రివిక్రమ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కరాటే మాస్టార్లు శ్రీనాద్, రాజేష్ కుమార్, ఆర్ఫీ, తోరణదీక్ష సమక్షంలో పోటీలు నిర్వహించారు. ఓంస్వరూప్, తేజేష్, కరుణ్, ఖాద్రీ, శ్రాగ్విచౌదరి, పూర్వాజ్, జాహ్నవిలకు ఎల్లోగ్రేడింగ్ లభించింది. మమోగ్నో, అబీబ్, తన్వూజాలకు ఆరెంజ్, శశ్యాంక్, లాస్యసాయి, తస్నీస్, యాగవిలకు గ్రీన్‌బెల్టు, సూర్యకు బ్లూబెల్టు, సాయికీర్తిక్ పర్పుల్, వరుణ్‌తేజ్‌రెడ్డి, బ్రైన్‌గ్రేడ్‌లు సాధించారు. ఇన్‌స్ట్రక్టర్లుగా విష్ణుప్రియ, వెన్నా, సౌపర్ణికాలు వ్యవహించారు. ప్రతిభ కనబరచిన కరాటే విద్యార్థులకు గ్రేడింగ్‌తోపాటు ప్రశంసాపత్రం అందించారు.

శ్రీశైలానికి పాదయాత్ర

సోమందేపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సోమందే పల్లిలోని శ్రీశైలానికి ఆదివారం శివస్వాములు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉదయం శివాలయం వద్ద గురుస్వాములచే ఇరుముడి కట్టించుకుని బయలుదేరారు. సోమందేపల్లి నుంచి బయలుదేరిన శివస్వాములకు స్థానికులు చేయూతనందించారు. కార్యక్రమంలో గురుస్వాములు హనుమంతు, వెంకటేశులు, నీరుగంటి నరసింహమూర్తి, కుమార్, దాదు, బాలు, నరసింహ పాల్గొన్నారు.

లేపాక్షిని సందర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి



బీజేపీ రాష్ట్ర కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

లేపాక్షి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్దిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి సత్యసాయిజిల్లా బీజేపీ ఇన్‌చార్జి బాలకృష్ణయాదవ్ కుటుంబసభ్యులతో కలిసి సంద ర్శించారు. ఆలయగైడ్ రఘుస్వామి ఆలయ చరిత్రను వివరించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కళ్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్థంభం, నాట్యమండపాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆగని వంక ఆక్రమణలు



వంకను చదును చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీనగర్‌లో వర్షపునీరు వెళ్లడానికి వున్న వంకను ఆక్రమించుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రజాదర్బార్‌లో మంత్రి సవిత దృష్టికి ఈ సమస్యను తెచ్చామన్నారు. ఇటీవల ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తన బృందంతో కలిసి వంక ప్రాంతాన్ని పరిశీలించి హద్దులు నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు. కొందరు స్వార్థపరులు అవేవి లెక్కచేయకుండా ఆదివారం ఎక్స్‌కవేటర్‌లతో వంకను పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టడానికి పూనుకోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని సూచించారు.

సోమఘట్ట ఆలయ అభివృద్ధికి పెద్దపీట

● జోరుగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలు



సోమఘట్టలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

చిలమత్తూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంతగానో ప్రసిద్ధికెక్కిన సోమఘట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వహయాంలో ఆగిపోయిన ఆలయ పునర్నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పవచ్చు. ఆలయంలో మౌలిక సదుపాయాలతో పాటు ఎన్నో ఏళ్లుగా భక్తులకు ఇబ్బందిగా మారిన రహదారిని ప్రస్తుతం పునర్నిర్మించారు. ప్రభుత్వ సహకారానికి తోడు దాతలు కూడా ముందుకు రావడంతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంటోంది.

ఆలయం ముందు సిమెంట్ ప్లాట్‌ఫారం

గతంలో ఆలయ ముందు భాగం ఎగుడుదిగుడుగా భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ ముందు ప్రాంగణమంతా సిమెంట్ ప్లాట్‌ఫారం ఏర్పాటుచేశారు. దాంతో ఆలయంలో స్వామి వారి ఉత్సవాలు జరుపుకోవడానికి, రథోత్సవానికి ఎంతో అనుకూలంగా మారింది. దాంతో భక్తులకు మార్గం సుగమం అయింది. ఇపుడు ఈ సిమెంట్ ప్లాట్‌ఫారం ఆలయానికి కొత్త శోభ చేకూర్చింది.



ఆలయం ముందు భాగాన ఏర్పాటుచేసిన సిమెంట్ ప్లాట్‌ఫాం

మారగాని కుంటకు వెళ్లే తారురోడ్డు నుంచి ఆలయం వరకు ఉన్న కిలో మీటరు రహదారి గతంలో రాకపోకలకు అనుకూలంగా ఉండేది కాదు. దాంతో ఆలయానికి వచ్చే భక్తులు నిత్యం ఇబ్బందిపడేవారు. అయితే కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో నిత్యం ఆలయానికి వచ్చే భక్తులకు రోడ్డు సౌకర్యం మెరుగుపడింది.

ఆలయానికి ఎదురుగా గరుడ విగ్రహానికి ఏర్పాట్లు

ఆలయ శోభను పెంచే విధంగా ఆలయానికి ఎదురుగా సుమారు 500 మీటర్ల దూరంలో భారీ గరుడ విగ్రహం ఏర్పాటుచేయడానికి పనులు సాగుతున్నాయి. ఆలయ ముఖ ద్వారం వద్ద గరుడవిగ్రహం ఏర్పాట్లు పూర్తయితే ఆలయ ప్రతిష్ఠ మరింత పెరగనుంది. ఎమ్మెల్యే సహకారంతో ఆలయ ప్రాంగణంలో టీటీడీ కళ్యాణ మంటపం నిర్మాణం కాబోతోంది. ఇప్పటికే కళ్యాణ మంటపం నిర్మాణానికి భూమి చదును పనులు కూడా పూర్తయ్యాయి. ఆలయం వద్ద ఎక్కువ సంఖ్యలో వివాహాలు జరుగుతుండటంతో టీటీడీ కళ్యాణ మంటప నిర్మాణానికి ముందుకు వచ్చింది.

దాతల సహకారంతో మరిన్ని పనులు..

కోర్కెలు తీర్చే స్వామిగా వినుతికెక్కిన సోమఘట్ట నృసింహస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు కూడా బాగా సహకారం అందిస్తున్నారు. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా కళ్యాణ మంటప నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రదేశంలో స్వామి వారి కళ్యాణోత్సవంతో పాటు నూతన వధూవరుల కళ్యాణాలు జరిపించడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. అదేవిధంగా స్వామి రథాన్ని భద్రపర్చడం కోసం ఎత్తైన షెడ్డు కూడా నిర్మాణమైంది. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాల అమరికకు దాతలు ముందుకు వచ్చినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

సుపరిపాలనకు నిదర్శనం రాయలు

● శ్రీకృష్ణదేవరాయల జయంతి కార్యక్రమంలో వక్తలు

హిందూపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు నిలువెత్తు నిదర్శనం శ్రీకృష్ణదేవరాయలని నాయకులు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని ఆదివారం హిందూపురం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్‌చైర్మన్ రమేష్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు మన ప్రాంతంలోని పెనుకొండను రెండో రాజధానిగా చేసుకుని పాలించడం మన ప్రాంతానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, జనసేన ఇన్‌చార్జి ఆకుల ఉమేష్, నాయకులు అమర్నాథ్, వెంకటేష్, చంద్రమోహన్, రజిని, రాయల్‌గోపాల్ బీజేపీ పార్థసారథి పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలో కాపుభవన్ నిర్మాణానికి ప్రభుత్వం గుమ్మయ్యగారిపల్లి వద్ద స్థలం మంజూరు చేసిందని బలిజసంఘం నాయకులు టీడీపీ కన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. గోరంట్లలో శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతిని బలిజ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చరిత్రకారుడు మైనాస్వామి హాజరయ్యారు. పట్టణంలోని కదిరిరోడ్డునుంచి విజయనగర్ కాలనీ వరకు భారీ బైక్ ర్యాలీ జరిగింది. మైనాస్వామి మాట్లాడుతూ, కృష్ణదేవరాయల జయంతి దశాబ్దాలకాలంగా ఫిబ్రవరి 16న జరుపుకుంటున్నారన్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద మునిసిపల్ చైర్మన్



గోరంట్లలో బైక్ ర్యాలీ చేస్తున్న బలిజ కులస్తులు

అయితే కొంతమంది పనికట్టుకుని లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. వివాదాలు విడనాడి ఐకమత్యంతో బలిజల అభివృద్ధికోసం అన్ని రంగాల్లో పనిచేయాలన్నారు.

చిలమత్తూరు: శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను మండల బలిజ సంఘం నాయకులు ఆదివారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ముందుగా వారు రాయల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం అక్కడ నుంచి ప్రధాన వీధుల గుండా రాయుల చిత్రపటాన్ని రథంపై ఊరేగించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం శ్రీసజ్జగంత రంగనాథస్వామి బలిజకులస్థుల సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారికి కేటాయించిన స్థలంలో రాయల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రతియేటా ప్రభుత్వం అధికారికంగా రాయల ఉత్సవాలను నిర్వహించాలన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ రాజీవ్‌గాంధీ సర్కిల్‌లోని వారపుసంతతోపాటు డైలీమార్కెట్ వద్ద పార్కింగ్ సమస్య వల్ల కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చినవారు నానాఇబ్బంది పడుతున్నారు. అలాగే ఉదయం గ్రామాల నుండి కూరగాయలు, ఆకుకూరలను విక్రయించేందుకు వచ్చిన రైతులు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతం పావగడ, మధుగిరి, హిందూపురం, అమరాపురం, పెనుకొండ తదితర ప్రాంతాల కూడలి కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువారం వారపుసంత కారణంగా వందలాది వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య సైతం నెలకొంటోంది. కొన్ని సందర్భాల్లో విధుల్లో ఉన్న పోలీసులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా తుమకూరు, బెంగళూరు, శిరా, అగళి, రొళ్ల, పావగడ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ మార్కెట్ మీదుగానే వెళ్లాల్సి ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు వాహనాల పార్కింగ్‌ను మరోచోటికి మార్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

దోసకాయలు తిని మేకల మృతి



మేకల కళేబరాలను చూపుతున్న కాపరి

అగళి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అగళి మండలం పరిధిలోని కరిదాసనపల్లి, గొల్లహట్టి గ్రామానికి చెందిన చిక్కన్న అనే మేకల కాపరికి చెందిన నాలుగు మేకలు మెడిసిన్ దోసకాయలు తిని మృతిచెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చిక్కన్న ఆదివారం తన మేకలను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో రైతు పొలంలో సాగుచేసిన మెడిసిన్ దోసకాయలకు పిచికారి నిమిత్తం నీటిలో మందును కలిపి అక్కడే ఉంచాడు. దాహంతో వెళ్లిన మేకలు ఆ నీటిని తాగి అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో తనకు రూ.60వేలు దాకా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని మేకల కాపరి చిక్కన్న కోరాడు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ

హిందూపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎక్సైజ్ సీఐగా లక్ష్మీదుర్గయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతనెలలో హిందూపురం నియోజకవర్గంలో నకిలీ మద్యం విక్రయాలు జరగడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. దీంతో ఇక్కడి సీఐను విజయవాడ ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు అటాచ్ చేశారు. అయితే లోతుగా విచారించి సీఐ ప్రమేయం లేదని నిర్ధారించుకున్న అనంతరం ఆయన్ను తిరిగి పురానికి పంపుతూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.



సీఐ లక్ష్మీదుర్గయ్య

వైద్య శిబిరానికి భారీ స్పందన

అమరాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):అమరాపురం పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో తన తండ్రి దివంగత డాక్టర్ నరసింహప్ప జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.దివాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శాంతిరాం కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో చెవి, ముక్కు, గొంతు పరీక్షలు, కంటి పరీక్షలు చేసినట్టు, అవసరమైన వారికి శాంతిరాం కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌కూడా చేయించనున్నట్లు ఆయన వెల్లడించారు.

మడివాల మాచదేవునికి జ్యోతులు



మడివాలస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న రజకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 16:(ఆంధ్రజ్యోతి): రజక కులస్తుల ఆరాధ్యదైవం మడివాల మాచదేవునికి ఆదివారం జ్యోతులు మోశారు. పట్టణ పరిధిలోని సింగిరెడ్డిపల్లిలో రజక కులస్తులు ఉదయం వారి కులదైవం మడివాల మాచదేవుని చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో యువత కేరింతలు కొట్టారు. అనంతరం పూల హారాలు వేసి ఆయనకు జ్యోతులు సమర్పించారు. కార్యక్రమంలో రజక కుల నాయకులు నాగరాజు, మహిళలు కులస్తులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మడకశిర రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడలు, కల్చరల్, కార్యక్రమాల్లో క్రీడాలో మడకశిర పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్ రెడ్డి తెలిపారు. కళాశాలలో క్రీడాకారులను ఆదివారం అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజయనగరం జిల్లా గరివిగిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 10 నుంచి 13 వరకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బాలికలు వాలిబాల్, బ్యాంట్మిన్, టేబుల్‌టెన్నిస్ ప్రథమ స్థానంలోను, అథ్లెటిక్స్, ఎలక్యూషన్ షాట్‌పుట్, డిస్క్‌త్రోలో తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు. బాలుర విభాగంలో బాల్‌బ్యాట్మింటన్, టేబుల్ టెన్నిస్ లో ప్రథమ స్థానం, క్రికెట్,ఖోఖోలో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్, షాట్‌పుట్, డిస్క్‌త్రోలో తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు.

ఘనంగా మాఘమాస పూజలు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాఘమాసాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆదివారం సంకష్ట హర చతుర్థి కావడంతో వినాయకుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అనేక మంది మహిళలు దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుండి ఉపవాసం ఉంటూ రాత్రి చంద్రుడి దర్శనం అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. అదేవిధంగా పట్టణంలోని వడుసులమ్మ, కొల్లాపురమ్మ, మూలకంఠేశ్వరీదేవి, గంగాపూజమ్మ దేవాలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన వడుసులమ్మ

హెంజేరు సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి):అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామంలో శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన జరిపారు. సిద్దేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాన్ని పంచిపెట్టారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వచ్చిన భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

వేతన బకాయిలు చెల్లించాలి



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

పెనుకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న పదినెలల జీతాలు, 32నెలల పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో 18నుంచి నుంచి సమ్మెబాట పడతామని సీఐటీయు వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సీఐటీయు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రమేష్ విలేకరులతో మాట్లాడుతూ గత 14సంవత్సరాలుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, పెనుకొండలో దాదాపు 600మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి పది నెలల నుంచి వేతనాలు, అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విధులకు వెళ్లాలంటే కనీసం వాహనాలకు పెట్రోల్‌కూడా వేయించుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. వీరికి ఎవరూ అప్పులు కూడా ఇవ్వడం లేదన్నారు. గత యేడాది సమ్మె సందర్భంగా కార్మికులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కాంట్రాక్టర్లు పోలీసుల మధ్య కుదిరిన ఒప్పందం నేటికీ అమలు చేయడం లేదన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమశేఖర్, మహానంది, గిరీష్, సురేష్, సుభాష్, సుధా, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో చెత్త తొలగించి అలాగే వదిలేశారు..



మురుగు కాలువను శుభ్రంచేసి రోడ్డుపై వేసిన చెత్త

పరిగి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని 90 ఇళ్ల కాలనీలో నెల, రెండు నెలలకోసారి మురుగు కాలువలో చెత్తతీసి రోడ్డుపక్కనే వేసి వదిలేస్తున్నారు. స్థానికులు చెత్తను వెంటనే అక్కడి నుంచి తొలగించాలంటూ చెబుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆ దుర్గంధంతో దోమలు వృద్ధిచెంది చిన్న పిల్లలకు విషజ్వరాలు సోకుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేశారు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ చెత్తను రహదారిపై నుంచి తొలగించాలని కోరుతున్నారు.

బలిజ సంఘం అధ్యక్షుడిగా గుట్టూరు సూర్యనారాయణ



పెనుకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బలిజ సంఘం పట్టణ అధ్యక్షుడిగా గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో బలిజసంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షునిగా సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ప్రగతి గ్లోబుల్‌జెన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసులు, మాజీ స్కూల్ కమిటీ ఛైర్మన్ పులగూర్ల శ్రీనివాసులును ఎన్నుకున్నారు. యువజన సంఘం అధ్యక్షులుగా సాయికుమార్, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు ఎంపికయ్యారు.

కందిపంటకు నిప్పు

లేపాక్షి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన రైతు గంగిరెడ్డి తన రెండెకరాల పొలంలో కందిపంటను సాగుచేశారు. పంటను కోయించి ఎండలో పొలంలోనే ఆరబెట్టాడు. ప్రమాదవశాత్తు ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుని మొత్తం పంట అగ్నికి ఆహుతైందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. దాదాపు రూ.90వేలు నష్టం వాటిల్లిందని తననుఆదుకోవాలని బాధితుడు కోరాడు.